యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.కోదండరాం

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.ఎం.కోదండరాం సూచించారు. ఆర్ఎస్‌టీ టెక్నాలజీస్ అండ్ ఓరియన్ ఎడ్యుకేషనల్ సొసైటీ డియాజియో సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు బాగ్‌అంబర్‌పేట శ్రీనివాసనగర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. కార్యక్రమంలో సీఈవో రంజిత్‌కౌర్ విద్యార్థులు తదితరులుపాల్గొన్నారు.

వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మాణం


వీరసావర్కర్ విగ్రహం వద్ద పనులు చేస్తున్న సిబ్బంది

బర్కత్‌పుర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ, మెట్ల నిర్మాణ పనులు శనివారం చేపట్టారు. ఈనెల 21న 'ఆంధ్రజ్యోతి' జోన్ పేజీలో వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ, మెట్ల నిర్మాణంలో జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం అనే వార్తకు అధికారులు స్పందించారు. దీనిపై స్పందించిన అధికారులు వీరసావర్కర్ విగ్రహం వద్ద శనివారం పనులు ప్రారంభించారు. విగ్రహం చుట్టూ ప్రహరీ, మెట్ల నిర్మాణ చేపట్టారు. ఈనెల 26న వీరసావర్కర్ వర్ధంతి కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

కేసీఆర్ అవినీతిపై సీబీఐ, ఈడీ విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

నల్లకుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న మాజీ సీఎం కేసీఆర్ లక్షల కోట్ల అవినీతిపై ఇటీవల కాగ్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా విచారణ జరిపి అరెస్ట్ చేయాలని బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ డీ.రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి, కేంద్ర విజిలెన్స్ మంత్రి, సీబీఐ డైరెక్టర్‌లకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలన్నారు. కేసీఆర్ కుటుంబసభ్యులు, అనుచరులు లక్షల కోట్ల రూపాయలు, వేల ఎకరాల భూములను దోచుకున్నారని ఆరోపించారు. నల్గొండ ఎంపీ సీటు తనకు కేటాయించాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు.


ఎల్‌బీ స్టేడియంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాములు నాయక్

సేవాలాల్ మహరాజ్ క్రీడాపోటీలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్రవ్యాప్తంగా సేవాలాల్ మహరాజ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములునాయక్ తెలిపారు. ఇందులో భాగంగా ఎల్‌బీ స్టేడియంలో సేవాలాల్ మహరాజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఎల్‌బీ స్టేడియంలో సేవాలాల్ మహరాజ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో విజేతకు లక్ష రూపాయల నగదు బహుమతి, రన్నర్‌కు యాభై వేల రూపాయల నగదు బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16 జట్లు పాల్గొంటున్నాయని, ఈ నెల 26న ఫైనల్ పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత చిన్న శ్రీశైలంయాదవ్, ఐఆర్ఎస్ అధికారి చిరునాయక్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ మోహన్‌సింగ్‌నాయక్, సీటీవో భీష్మానాయక్, టీపీసీసీ కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, సుభాష్‌నాయక్, నిర్వాహకులు రాజేందర్‌నాయక్ పాల్గొన్నారు.

నెట్‌బాల్ మెన్ చాంపియన్ అంబేడ్కర్ కాలేజీ


ట్రోఫీతో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఓయూ పరిధిలోని కాలేజీస్థాయి నెట్‌బాల్ మెన్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలలో బాగ్‌అంబర్‌పేటలోని అంబేడ్కర్ కళాశాల నెట్‌బాల్ మెన్ పోటీలలో ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలిచింది. టీమ్ సభ్యులకు ఉస్మానియా యూనివర్సిటీ సెక్రటరీ డాక్టర్ కె.కృష్ణ ట్రోఫీ, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఓయూ ఐసీటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమేశ్వరరావు, అంబేడ్కర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న పోటీపరీక్షల అభ్యర్థులు, గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. లైబ్రరీ ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, మూత్రశాలలు అపరిశుభ్రంగా దుర్వాసన వెలువడుతోందని పోటీపరీక్షల అభ్యర్థి, బీఆర్ఎస్‌వీ నాయకుడు మిద్దె సురేష్ తెలిపారు. పరిస్థితిని బాగుచేయకపోతే గ్రంథాలయ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి - ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ల నడుమ 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహిళ మృతదేహం


మహిళ మృతదేహం

కవాడిగూడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధి వివరాలు ఇలా ఉన్నాయి. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరాపార్కు ఎదుట ధర్నాచౌక్‌లో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలు 40 నుంచి 50 మధ్య వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. తెలుపు, బూడిదరంగు నైటి ధరించి ఉన్నట్లు తెలిపారు.

ఇంకా షాక్‌లోనే..

(5వ పేజీ తరువాయి)

ఫలితం లేకుండా పోయింది.' అంటూ తల్లి గీత కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆమె ఇక లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక దుఃఖసాగరంలో మునిగిపోతున్న తల్లి గీతను చూసి ప్రతి ఒక్కరి గుండె తరుక్కుపోతోంది.

దుఃఖ సంద్రంలో నివేదిత

లాస్య నందిత సగం ప్రాణంగా, మంచి అక్కగా అందరికీ సుపరిచితురాలైన నివేదిత పరిస్థితి మరీ దయనీయంగా మారింది. లాస్య మరణవార్త విన్నప్పటి నుంచి నివేదిత రోదిస్తూనే ఉన్నారు. ఎవరు పలకరించినా దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. కార్ఖానాలోని సాయన్న నివాసానికి వచ్చే ప్రతి ఒక్కరినీ అక్కా చెల్లెళ్లు నివేదిత, లాస్యనందితలు ఆప్యాయంగా పలకరిస్తుంటారు. లాస్య మృతితో నివేదిత దిగ్భ్రాంతికి గురయ్యారు. అప్పటి నుంచి రోదిస్తూనే ఉన్నారు. సాయన్న ఇంట్లో కాలు పెట్టగానే నవ్వుతూ దర్శనమిచ్చే అక్కాచెల్లెళ్లలో చెల్లి ఇక లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక జనం కూడా నిర్వేదానికి గురవుతున్నారు.

కో-ఆపరేటివ్ రంగాన్ని బలోపేతం చేస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కో-ఆపరేటివ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వపరంగా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కో-ఆపరేటివ్ రంగం అభివృద్ధికి ఉద్యోగులు కూడా కృషి చేయాలన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపంలో ఆలిండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 8వ జాతీయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తుమ్మల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తాము ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఎర్రజెండా లేకపోతే ఈ ట్రేడ్ యూనియన్స్ కూడా లేవని గుర్తు చేశారు. కో-ఆపరేటివ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు ఆమోదయోగ్యమైనవని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకులు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఆలిండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.సురేందర్, నాయకులు మహేందర్‌రెడ్డి, నాగభూషణయ్య, డాక్టర్ మురళీధర్, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర: రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఆత్మ ఉద్యోగులను వ్యవసాయ శాఖలో పూర్తిగా విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆత్మ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదావత్ కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శి ఎం.సురేందర్‌రెడ్డి, కోశాధికారి జ్యోతిలక్ష్మి డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని ఆత్మ శాఖలో ఏటీఎం, బీటీఎం, సీపీలుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత ఇంక్రిమెంట్లు, పీఆర్‌సీ ఇవ్వడం లేదన్నారు. శనివారం ఆత్మ స్టాఫ్ అసోసియేషన్ నూతన డైరీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, క్యాలెండర్‌ను ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపర్ణరెడ్డి, సాయిచరణ్, రవీందర్, వినోద్, స్పందన, జయంతి, కిరణ్ పాల్గొన్నారు.

మలేషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే..
అదనంగా ఒక సంవత్సరం గడిపే అవకాశం!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యుత్తమ వర్సిటీలలో కొన్ని మలేషియాలో ఉన్నాయి. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, మెడిసన్ తదితర రంగాలలో తమ యూనివర్సిటీలకు అంతర్జాతీయంగా టాప్ 50లో స్థానం లభించిందన్నారు. ఎడ్యుకేషన్ మలేషియా గ్లోబల్ సర్వీసెస్ (ఈఎంజీఎస్) సీఈఓ నోవి తాజుద్దీన్, నగరంలో మొదటిసారిగా బేగంపేటలోని ఓ హోటల్‌లో మలేషియా ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. మలేషియాలో అత్యుత్తమ యూనివర్సిటీలలో 8 యూనివర్సిటీల ప్రతినిధులు హాజరైన ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు నగరంలోని పలు మైనారిటీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈఎంజీఎస్ సీఈఓ నోవి మాట్లాడుతూ తొలిసారిగా ఇండియాలో తాము ఈ రోడ్‌షోలను చేస్తున్నామన్నారు. ఇప్పటికే చెన్నై, ఏపీలలో తమ ఎడ్యుకేషన్ ఫెయిర్ షోలను చేశామంటూ ఇక్కడ విద్యార్థుల నుంచి వస్తోన్న స్పందన అపూర్వమన్నారు. ఇటీవలే భారతీయ విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం పోస్ట్ గ్రాడ్యుయేట్ వీసా తీసుకువచ్చిందంటూ, తమ విద్య ముగిసిన తరువాత కూడా ఓ సంవత్సరం పాటు విద్యార్థులు అక్కడ గడిపే అవకాశం ఉందన్నారు. మలేషియా హానరరీ కాన్సుల్ జనరల్, సౌత్ ఇండియా కె.శరవణకుమార్ మాట్లాడుతూ మలేషియాలో అంతర్జాతీయ విద్యార్థులకు అపార అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఏసియా పసిఫిక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, సన్‌వే, తునుకు అబ్దుల్ రెహమాన్ యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ వర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సంత్ సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకం

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన మార్గంలో ముందుకుసాగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. లంబాడీల అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందన్నారు. లంబాడీతండాలో ఆలయ స్థల సేకరణ కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. శనివారం సేవాలాల్ సేన నగర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ ఆధ్వర్యంలో లంబాడీతండాలోని డబుల్‌బెడ్ రూం భవనం వద్ద బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు భూక్య సంజీవ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్‌లు హాజరై సంత్ సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిక్షు నాయక్, రఘురాంరాథోడ్, రేఖ నాయక్, దేవేందర్‌నాయక్, హోబ నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగమంటూ మోసం

● ఇద్దరి అరెస్ట్.. మరొకరు పరార్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఆఫర్ లెటర్‌లు సృష్టిస్తూ ఎంతోమంది నిరుద్యోగులను బురిడీ కొట్టించి భారీగా డబ్బులు దండుకున్న ఇద్దరు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. వివరాలు ఇలా.. ప్రకాశం జిల్లా మద్దిపాడు ప్రాంతానికి చెందిన ముచ్చు శివప్రసాద్(32), ధన్‌రాజ్, బట్టగిరి రంగా పార్థుడు(26) డబ్ల్యుఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ పేరిట ఉన్న కంపెనీని.. అదే పేరిట ఆన్‌లైన్‌లో సృష్టించి జాబ్‌ఫ్రాడ్‌కు తెరలేపారు. నకిలీ ఆఫర్ లెటర్‌లు సృష్టించి నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఓ బాధితుడికి గత నెల 26న ఓ కాల్ వచ్చింది. డబ్ల్యుఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జాబ్ ఉందని, ఆసక్తి ఉంటే సర్టిఫికెట్లు పంపించాలని సూచించారు. ఉద్యోగం రావాలంటే రూ.1.60 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని.. తొలుత రూ.20 వేలు, ఆఫర్ లెటర్ వచ్చిన తర్వాత మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుం దని మరో కాల్ ద్వారా వివరించారు. వారు చెప్పినట్టే రూ.20వేలు వారు చెప్పిన ఖాతాకు బాధితుడు పంపించేశాడు. మరుసటి రోజే ఇంటర్వ్యూ ఉందని, ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసినట్లు నటించి అతడు సెలెక్ట్ అయినట్లు మరుసటి రోజు(జనవరి 27న) ప్రకటించేశారు. జనవరి 29న అతడి చేతికి నకిలీ ఆఫర్ లెటర్ కూడా వచ్చేసింది. బాధితుడు నిజ మిగతా డబ్బులు కూడా ఇచ్చేశాడు. ఆ తర్వాత హైటెక్ సిటీ అడ్రస్‌తో ఉన్న డబ్ల్యు ఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ పేరిట కంపెనీ ఉన్న అడ్రస్‌పై వెళ్లగా అక్కడి అధికారులు ఆ లెటర్ తమది కాదని.. ఎవరో మోసం చేశారని స్పష్టం చేశారు. అతడికి కాల్స్ వచ్చిన నెంబర్లకు కాల్ చేయగా ఎవరూ స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శివప్రసాద్, రంగాపార్థుడులను అరెస్టు చేశారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్, బ్యాంక్ పాస్‌బుక్, రూ. 25వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ధన్‌రాజ్ కోసం గాలిస్తున్నారు. నిందితులపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 12 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. బాధితులు ఇంకా చాలామంది ఉంటారని.. వారు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని పోలీసులు సూచించారు.

ఎయిర్‌పోర్ట్ తరహాలో రైల్వేస్టేషన్లు

● రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్టుల తరహాలో రైల్వే స్టేషన్లను ఆధునికీకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. జోన్ పరిధిలో సుమారు రూ.1800 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన, పూర్తి చేసిన పనులకు ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. శనివారం రైల్ నిలయంలో అరుణ్‌కుమార్ జైన్ విలేకరులతో మా ట్లాడుతూ తమ జోన్ పరిధిలో సుమారు రూ.925 కోట్ల వ్యయంతో 57 రైల్వేస్టేషన్‌లను ఆధునికీకరించనున్నట్టు తెలిపారు. ఇందులో తెలంగాణలో 15, ఏపీలో 34 స్టేషన్లను అమృత్ స్టేషన్‌ల కింద అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. తెలంగాణలో అమృత్ స్టేషన్‌ల అభివృద్ధి కోసం రూ.230 కోట్లకు పైగా నిధులు వ్యయం చేయనున్నారు. దేశ వ్యాప్తంగా రైల్వేస్టేషన్‌లను ఎయిర్‌పోర్టుల మాదిరిగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పనులు చేస్తున్నట్టు తెలిపారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వెంకటేష్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని 116 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.11,613,456 చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శనివారం అంబర్‌పేట ఎమ్మార్వో కార్యాలయంలో అందజేశారు. 91 మందికి కల్యాణలక్ష్మి, 25 మందికి షాదీ ముబారక్ చెక్కులు బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట, అంబర్‌పేట డివిజన్ల కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, యాకర్ల అమృత, విజయ్‌కుమార్‌గౌడ్, అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయిలతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో సయ్యద్ హజీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కరిజంపై దాడి హేయం


మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రచించి ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిన అంబేడ్కరిజంపైన మనువాదులు దాడి చేయడం హేయమైన చర్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబేడ్కరిజం, అంబేడ్కర్ భావజాలంపైన దాడులు చేస్తే సహించబోమని వారు హెచ్చరించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏపీ దళిత మహాసభ ఆధ్వర్యంలో 'అంబేడ్కరిజంపై దాడి - ప్రజాస్వామ్యవా దుల కర్తవ్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, జి.విజయ్‌రావు, డాక్టర్ పసునూరి రవీందర్, పి.శంకర్, జి.సాంబయ్య, మాష్టార్జీ, జయరాజు, టి.స్కైలాబ్‌బాబు, కోలా జనార్దన్, చేతన్, రాందాసు, రమేష్ తదితరులు హాజరై మాట్లాడారు. దేశంలో అంబేడ్కర్ ఆలోచన విధానాలపై, రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కత్తి పద్మారావు వంటి మేధావులపైన దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు అంబేడ్కర్‌ను, ఆయన ఆశయాలను కొనియాడుతుంటే మన దేశంలోని మనువాదులు మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ అంబేడ్కరిజాన్ని ముందుకు తీసుకుపోతున్న వారిపై దాడిచేయడం బాధాకరమన్నారు.

బీజేపీ విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): మార్చి 1న ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించే బీజేపీ విజయసంకల్పయాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గం ప్రచార కమిటీ కన్వీనర్ పూస రాజు, కో-కన్వీనర్ శేషసాయి కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో విజయసంకల్పయాత్రపై ముఖ్య నాయకుల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు.

● **చిక్కడపల్లి :** కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డా.లక్ష్మణ్ నిర్వహించబోయే విజయసంకల్ప యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గం బీజేపీ కంటెస్టెడ్ అభ్యర్థి పూస రాజు, గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ పిలుపునిచ్చారు.

● **కవాడిగూడ:** కిషన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న బీజేపీ విజయ సంకల్పయాత్ర ముషీరాబాద్ నియోజకవర్గంలో జయప్రదం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గం ప్రభారి వేముల అశోక్ సూచించారు.

● **బర్కత్‌పుర:** బీజేపీ విజయ సంకల్ప యాత్రతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 10 ఎంపీ సీట్లను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 26న బీజేపీ సంకల్పయాత్ర జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు చేరుకుంటుదని తెలిపారు.

గురుకులాల విలీన ప్రతిపాదనలు విరమించుకోవాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి


మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను విలీనం చేయాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘాల ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, సి.రాజేందర్, నందగోపాల్, వేముల వెంకటేష్, రఘుపతి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు ఆయా శాఖల ఆధ్వర్యంలో నడుస్తూ మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. నేడు వాటిని విలీనం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి రావడం బాధాకరమన్నారు. 1982లో పోరాడి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎంగా ఉన్న రోజుల్లో ముందుగా 46 గురుకులాల పాఠశాలలు నిర్మించినట్టు తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 10వతరగతిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు వస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

గాంధీనగర్ ఐఐటీతో ఈసీఐఎల్ ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గాంధీనగర్ ఐఐటీ, ఈసీఐఎల్ అధికారులు

కుషాయిగూడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈసీఐఎల్ సంస్థ మరో భారీ పరిశోధన ప్రాజెక్టును దక్కించుకుంది. గుజరాత్ గాంధీనగర్‌లోని ఐఐటీతో అటానమస్ నేవిగేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్/మెషీన్‌లెర్నింగ్ (ఏఐ/ఎంఎల్) అప్లికేషన్‌ల రూపకల్పన, సెక్యూరిటీ విభాగానికి సంబంధించి ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ అంశాలలో సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు అంగీకరించింది. ఈమేరకు శనివారం గాంధీనగర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రజత్ మూనా, ఈసీఐఎల్ పర్సనల్ డైరెక్టర్ డాక్టర్ అనేష్ కుమార్ శర్మ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కాగా, ఈనెల 16న గాంధీనగర్ ఐఐటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.మెహరోత్రా, ఈసీఐఎల్ జనరల్ మేనేజర్ సి.మురళీధర్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

యూజీసీ నిబంధనల ప్రకారమే పదోన్నతులు

● ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

తార్నాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయంటూ పలు దినపత్రికల్లో వస్తున్న వార్తలు నిరాధారమైనవని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఓయూలోని గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే పదోన్నతుల ప్రక్రియ జరిగిందని, జీవో నెం. 15 అనుసరించి, యూజీసీ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించామన్నారు. ఏమైనా అనుమానాలుంటే అడ్మినిస్ట్రేటివ్ అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంతో పేరు ప్రఖ్యాతలున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

సున్నితమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు

జాగ్రత్తలపై అధికారులకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సైబరాబాద్‌లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమ జరిగింది. సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించే విషయమై శనివారం సైబరాబాద్ కమిషనరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన 100 మంది అధికారులు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో సెక్టార్ పోలీస్ అధికారులు, రెవెన్యూ సెక్టార్ అధికారుల సమన్వయంతో సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, గుర్తించిన కేంద్రం సున్నితమైందని చెప్పడానికి కారణాలేంటనే అంశాలతో జిల్లా ఎన్నికల అధికారికి పంపించేందుకు రిపోర్టు సిద్ధం చేయడం, ఆయా ప్రాంతాల్లో ఓటు వేసేలా పౌరుల్లో అవగాహన కల్పించడం, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తల గురించి నిపుణులు వివరించారు.

బ్యాటరీ వీల్ చైర్ తయారు చేసిన సెయింట్ పీటర్స్ విద్యార్థి

● రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ పోటీలకు ఎంపిక



బోయినపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక 2024 రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల బోయినపల్లికి చెందిన టెన్త్ విద్యార్థి ఇంద్రజిత్ ఎంపికయ్యాడు. ఇన్‌స్పైర్ మనక్ పేరిట రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవాలు సీబీఎస్ఈ జాతీయ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో 2023 వరకు తెలంగాణలోని సీబీఎస్ఈ పాఠశాలలో చదువుతున్న 127 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఇటీవల ఆన్‌లైన్ విధానంలో ఎంపికచేశారు. అందులోంచి రెండురోజుల క్రితం 13 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అందులో సెయింట్ పీటర్స్ పాఠశాల విద్యార్థి ఇంద్రజిత్ తయారు చేసిన బ్యాటరీతో నడిచే వీల్‌చైర్‌ను ఇన్‌స్పైర్ సైన్స్ పోటీల నిర్వాహకులు టాప్‌వన్‌గా ఎంపిక చేశారు. రోగులను, దివ్యాంగులను తరలించడానికి ఈ వీల్‌చైర్లు ఉపయోగించడానికి ఎంతో తేలికగా ఉంటుంది. పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారులు ధర్మేందర్‌రావు, ఆర్.రోహిణి, పాఠశాల యాజమాన్యం, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల అధిపతి అల్ఫోన్స్‌రెడ్డి, అకాడమి డైరెక్టర్ టి.అరుణరెడ్డి ఇంద్రజిత్‌ను అభినందించారు.

గాయనికి ప్రతిభా అవార్డు ప్రదానం


మాళవిక ఆనంద్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక గాయని మాళవిక ఆనంద్‌ను శనివారం సాయంత్రం లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ సభ్యులు సన్మానించి ప్రతిభా అవార్డును బహూకరించారు. సికింద్రాబాద్ లయన్స్‌భవన్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శ్రీని రీజియన్ మీట్ జరిగిన కార్యక్రమంలో మాళవిక ఆనంద్ గాన ప్రతిభను ప్రశంసిస్తూ ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ మాజీ జాతీయ అధ్యక్షుడు హర్షవర్ధన్ మాడభూషి, శ్రీనిసుందర్‌రావు సన్మానించారు.